కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

**అమృతవాణి**

**1**

# అద్వైతం

అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

**ఎమెస్కో**

# అద్వైతం

**అ**ద్వైతాన్ని ఆదిశంకరులు పునఃప్రతిష్ఠించారని అందరికీ తెలుసు. అద్వైతం అంటే ఏమిటి? సంస్కృతంలో ద్వియనగా రెండు. ఆంగ్లంలో టూ (Two) అనే పదం కూడ ద్వి నుండి వచ్చిందే. రెండుండేది ద్వైతం రెండులేనిది అద్వైతం.

రెండు లేనిదానిలో రెండున్నవి ఏమిటి? జీవులు, బ్రహ్మమని భావిస్తాం కదా! ఇట్టి ద్వంద్వ భావం పనికిరాదు. ఉన్నది బ్రహ్మమే, రెండవది దానికి భిన్నంగా లేదని చెప్పేది అద్వైతం, ఉన్న ఒక సత్యమే మాయవల్ల అనేక జీవులుగా కన్పిస్తోంది. నటుడెన్ని వేషాలు వేసినా ఉన్నవాడొకడేకదా! పెక్కు జీవులున్నట్లు కనబడినా అందున్న పరమాత్మ ఒక్కడే. పరమాత్మయని, జీవాత్మయని రెండుభిన్నమని వ్యవహరిస్తూ ఉంటాం. కాని ఉన్నది ఆత్మఒక్కటే ఇట్లా భావింపగలిగతే భ్రాంతి తొలగింపబడి జ్ఞానోదయమై పూర్ణమైన అఖండమైన ఆత్మస్వరూపులం కాగలం. ఈ తత్త్వాన్ని అందించినవారు, లేదా స్థిరపరచినవారు ఆదిశంకరులు.

ఈ ఆత్మానుభవం ఒంటబట్టినపుడు దుఃఖము, శత్రుత్వము, బంధమూ ఉండవు. మనకంటె మరొకటి ఉన్నదని భావిస్తే పైగుణాలు మనకు సంక్రమిస్తాయి. మనకంటె మరొకటి లేదని భావించగలిగినపుడు బంధింపబడే వాడు లేడు, బంధము లేదు. మనకంటె ఒకటి ఉంటేకదా! ఈ పైబంధాల నుండి దూరం కావడమే ముక్తి లేదా మోక్షం.

ఈ బంధాతీత స్థితి ఎక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో, భవిష్యత్కాలంలోనో వచ్చేది కాదు. ఈ జన్మలోనే ఇప్పుడే కలగాలి. నిజం చెప్పాలంటే మోక్షమనేది క్రొత్తగావచ్చేది కాదు. బంధాతీత స్థితియే బ్రహ్మము. అదే అఖండ సత్యము. ఆకాశము అన్నిటా వ్యాపించి శరీరాలనే ఘటాలలోనూ వ్యాపించింది. అనంతాకాశము, ఈ ఘటాకాశమూ ఒక్కటే. కుండకొక ఆకారం, ఈ శరీరమనే కుండకూ ఒక ఆకారం

ఉంది. కుండపగిలితే అందలి ఆకాశం అనంతాకాశంలో లీనంకావడం లేదా? భిన్నభిన్నమైన కుండలుగా ఉన్నాం. రూపాలుపోతే మిగిలేది ఆకాశమే కదా!

అట్టి భావనరావడానికి, దృఢపరచాడనికి అనేక కర్మకాండలు, పూజాపద్ధతులు ఏర్పడ్డాయి. అంతిమ లక్ష్యాన్ని చేరుకోవడానికి అనేకమైన మెట్లను ఏర్పాటు చేసారు శంకరులు. అంతా ఒకటే అనే భావన, సాధన చేయగా చేయగా ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడుతుంది. అది వెంటనే పట్టు బడకపోయినా ఆ సత్యమున్నదని మొదటి నుండి భావన చేయగలగాలి.

లోకంలో మనకంటె అన్నీ భిన్నంగా ఉండడం కనిపిస్తూ ఉంటే అంతా ఒకటని ఎట్లా భావించగలం?

చూడండి – మనకు మూడవస్థలున్నాయి. మేలుకొన్న (జాగ్రత్తు), కలలుగన్న (స్వప్న) గాఢనిద్రలో నుండుస్థితి (సుషుప్తి) అనేవి ఉన్నాయి. కాని అన్నిటిని అనుభవించేవాడొకడే కదా! అపైన కలలుగనే స్థితికి మేల్కొన్న స్థితికి సంబంధమేలేదు. అయినా నిద్రబోయేవాడు, మేల్కొన్న వాడు ఒక్కడే. అట్లాగా సమస్త ప్రాణివర్గంలో ఉన్నది ఒక్కడే. ఆ ఉన్న ఒక్కడే తానని భావించగలగాలి.

ఒకమాటు శాంతంగా, ఒకమాటు కోపంగా ఉంటాం. రెండు స్థితులనూ అనుభవించేది ఒక్కడే కదా! శరీరంలో మార్పులు, రావడం వల్ల శిశువే వృద్ధుడవుతున్నాడు. ఇట్లా మేల్కొన్న దశలోనే మార్పులు కన్పిస్తూ ఉంటే ఇక కలల ప్రపంచం గురించి చెప్పేదేముంది? కలలో మన మనస్సు ఎన్నిటిని సృష్టిస్తుందో కదా! మనం చేయకూడదనుకొన్న వాటినీ కలలోచేస్తున్నాం. అయినా ఒక్కడే అంతా చేస్తున్నాడు. ఇక సంధి మొ॥ రోగస్థితిలో మనం చేసే వాటికి విరుద్ధంగా చేస్తున్నాం. ఒక పుస్తకం వ్రాసిన వాడు దీనినే ఆ స్థితిలో చింపేస్తున్నాడు.

అట్లాగే ప్రపంచమొక కల. భ్రాంతి యనే జ్వరం పట్టుకొని సంధి స్థితిలో ఉన్నామని భావించగలిగితే అంతా ఒకటే అనే భావన కల్గుతుంది. మన మనస్సు కలలో చిత్రవిచిత్రవస్తువులను సృష్టిస్తున్నట్లుగానే ఒక సమష్టి మనస్సూ (Cosmic Mind) దాని ప్రతిబింబాలైన సమస్తవస్తువులను సృష్టించిందని భావించగలం. పుస్తకం వ్రాసినవాడు, దానిని చింపిన వాడూ ఒక్కరే అనే భావన కల్గుతుంది. ఎవడైనా మనల్ని కొట్టినపుడు ఎవడో కొట్టాడని భావించడు, తనను తానే కొట్టుకొన్నానని భావిస్తాడు.